జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 17 | జూన్ | 2025 ◆ పేజీలు : 5



## అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ అందేలా అధికారులు కృషిచేయాలి

▪ గిరిజన దర్బార్ లో ఐటీడీఏ పీవో రాహుల్



**భద్రాచలం, జూన్ 16 (ప్రజాజ్యోతి ):** అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా యూనిట్ అధికారులు కృషిచేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో పీవో రాహుల్ గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. తన పరిధిలో ఉన్న వాటిని అక్కడికక్కడే పరిష్కరించి మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు

మిగతా 2 లో...





3 లో..

## కలెక్టర్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం

# అభివృద్ధి బాటలో...

**వివిధ రంగాల్లో మార్గదర్శకంగా నిలుస్తున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

◆ కొత్తగూడెం కలెక్టరేట్, ప్రజాజ్యోతి

పాలనలో తనదైన శైలితో ఉత్తమంగా ప్రభుత్వ పథకాలను అమలు చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఈనెల 16వ తేదీ నాటికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టి ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా స్పెషల్ స్టోరీ...



## వ్యాపార విస్తరణ పనుల్లో..

# వేగం పెరగాలి

- సోలార్, పవన, జియో థర్మల్ విద్యుత్తు, బొగ్గు నుంచి కెమికల్స్ పై ప్రత్యేక సమీక్ష
- పనులు మందకొడిగా సాగితే ఉపేక్షించేది లేదు
- అన్ని విభాగాల అధిపతులకు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ హెచ్చరిక
- 28 రకాల విస్తరణ ప్రతిపాదనలపై సుదీర్ఘంగా సమీక్షించిన ఛైర్మన్



**కొత్తగూడెం ( సింగరేణి), జూన్16, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులను, పనులను మరింత వేగవంతంగా నిర్వహించాలని, మందకొడిగా పనులు కొనసాగితే ఉపేక్షించేది లేదని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ వివిధ విభాగాల అధికారులను హెచ్చరించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి సోమవారం నిర్వహించిన వీడియో సమావేశంలో సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టిన సోలార్ విద్యుత్, పవన విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్, జియో థర్మల్ విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, కీలక ఖనిజాల ఉత్పత్తి, జాయింట్ వెంచర్ల ఏర్పాటు, కార్బన్ డయాక్సైడ్ నుండి మిథనాల్ తయారీ, సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్, భూగర్భ గనుల్లో కోల్ గ్యాసిఫికేషన్ తదితర 28 రకాల ప్రాజెక్టులు, పనులపై ఆయన సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రాజెక్టులపై ఇప్పటికే ప్రాథమిక అవగాహనకు రావడం, కొన్ని పనుల పట్ల ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందని, మరికొన్ని పనులపై ఏజెన్సీల ద్వారా అధ్యయనం జరుగుతుందని, సింగరేణి సంస్థకు

మిగతా 2 లో...



## కలెక్టర్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం

# అభివృద్ధి బాటలో...

◆ కొత్తగూడెం కలెక్టరేట్, ప్రజాజ్యోతి

**పాలనలో తనదైన శైలితో ఉత్తమంగా ప్రభుత్వ పథకాలను అమలు చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఈనెల 16వ తేదీ నాటికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టి ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా స్పెషల్ స్టోరీ...**

**వివిధ రంగాల్లో మార్గదర్శకంగా నిలుస్తున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**2024 జూలై 16న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన నాటినుండి జిల్లా అభివృద్ధికి వినూత్న కార్యక్రమాలతో శ్రీకారం చుట్టారు. పేద ప్రజలకు విద్య, వైద్యం, సంక్షేమ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతూనే.. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా. పకడ్బందిగా సమర్థవంతమైన పాలనను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు అందిస్తున్నారు. జిల్లా పాలనా బాధ్యతలు స్వీకరించిన వెంటనే వ్యవసాయం, విద్య ,వైద్య వ్యవస్థలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.**

### వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి - మునగ సాగుకు ప్రోత్సాహం.

వ్యవసాయరంగం పై ప్రత్యేక దృష్టి సారించి రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు కలెక్టర్ వివిధ మార్గాలను అన్వేషించారు. దీనిలో భాగంగా ప్రత్యేకంగా మునగ సాగుకు ప్రోత్సాహం ఇస్తూ అనేక మండలాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మునగ సాగు ద్వారా తక్కువ పెట్టుబడి, అధిక ఆదాయాన్ని అందు కోవచ్చని రైతులకు తెలియజేస్తూ చైతన్యపరిచారు. మునగ సాగు వల్ల లాభాలు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించి రైతులను అధికంగా అభివృద్ధి పరిచేందుకు ఎంతగానో కృషి చేస్తున్నారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకూడదని అంతర్ పంటల సాగు ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందాలని తెలియజేస్తూ పెరటి కోళ్ల పెంపకం, తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల సాగు వంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులను చైతన్యవంతులని చేశారు,

### చేపల పెంపకం తో మారుమూల గ్రామాల్లో వెలుగు

చేపల పెంపకాన్ని కేవలం చెరువులకే పరిమితం చేయకుండా, వ్యవసాయ క్షేత్రాల్లోని ఫామ్ పొండ్లలో ఫామ్ ఫాన్స్ చేపల పెంపకంపై ప్రత్యేక దృష్టిసారించారు. ఇది జిల్లా వ్యవసాయ విధానాల్లో సమగ్ర వ్యవసాయాన్ని (ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్) ప్రోత్సహించేందుకు తీసుకున్న వినూత్న నిర్ణయంగా నిలిచింది. ప్రతి రైతు పొలం వద్ద ఏర్పాటు చేసిన నీటి సంరక్షణ గుంతలను కేవలం సాగునీటి ఉద్దేశానికే కాకుండా, చేపల పెంపకానికి ఉపయోగించాలనే ఆలోచనతో కలెక్టర్ కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. వ్యవసాయ క్షేత్రాలలో అంతర్ పంటగా ఫామ్ పొండ్ ఇళ్లలో చేపల పెంపకం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని పలు యూనిట్లను స్థాపించి నిరూపించారు.

### ప్రకృతి వ్యవసాయానికి నూతన చైతన్యం.

జిల్లాలో ప్రకృతి వ్యవసాయానికి నూతన దిశను అందిస్తూ, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్వయంగా బయోచార్ తయారీని ఆచరణలో చూపించి రైతులకు ప్రేరణ ఇస్తున్నారు. సేంద్రియ పద్ధతుల్లో మట్టికి పోషకాలు అందిస్తూ దిగుబడులు పెంచే బయోచార్ తయారీ పద్ధతులపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించి రైతులకు వివరించిన కలెక్టర్, ప్రకృతి వ్యవసాయాన్ని ఆశ్రయించి రైతులు ఆర్థికంగా ముందుకు సాగాలని దృఢ సంకల్పాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రకృతి పద్ధతులపై రైతుల్లో అవగాహన పెరిగేలా చర్యలు చేపట్టారు. జిల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా ఇది కీలకంగా మారుతోంది. సహజ వనరుల వాడకంతో పాటు వ్యయాన్ని తగ్గించడంలో బయోచార్ కీలక పాత్ర పోషిస్తుం దని కలెక్టర్ పేర్కొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకోవడానికి కలెక్టర్ స్వయంగా రాత్రి బస , ఆకస్మిక తనిఖీలు నిర్వహించి తానే స్వయంగా ప్రతి పాఠశాలలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కారానికి కావలసిన ప్రణాళికలను రూపొందించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించేందుకు కావలసిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు. విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించడానికి గాను జిల్లాలో మూడు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేయడం లో కీలక పాత్ర పోషించారు.

### గిరిజన జిల్లాలో ఆరోగ్య రంగాన్ని మరింత మెరుగుపరిచే దిశగా అడుగులు

మారుమూల గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు సమగ్ర వైద్యం అందించేందుకు జిల్లా కలెక్టర్ తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, అందుబాటులో ఉన్న వసతులపై సమీక్షలు చేపడుతున్నారు. వైద్య సేవల నాణ్యత మెరుగుపరచే దిశగా అవసరమైన ఆధునిక వైద్య పరికరాల సమకూర్పుపై దృష్టి సారించారు. అత్యాధునిక సాంకేతిక పరికరాలు, డయాగ్నస్టిక్ సదుపాయాలు, వంద పడకల ఆసుపత్రుల నిర్మాణాలకు అనుమతులు,అత్యవసర వైద్యం కోసం అవసరమైన వాహనాలు వంటి సదుపాయాలను ఆసుపత్రులకు అందించేలా చర్యలు చేపట్టారు.ప్రతి ఒక్క రోగికి సరైన సేవలు అందేలా వైద్య సిబ్బందికి మార్గనిర్దేశం చేసి, పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేశారు.

### పర్యావరణ పరిరక్షణ - ఔషధ మొక్కలపై ప్రజలకు అవగాహన

పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యాచరణలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కళాశాలల్లో ఔషధ గుణాలు కలిగిన మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తులసి, రణపాల, వెలగ, ఉసిరి వంటి ప్రజలకు ఉపయోగకరమైన మొక్కలు నాటేందుకు ఆదేశాలు జారీ చేశారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణతో పాటు విద్యార్థులు, చిన్నారులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించేందుకే ఈ చర్యలు తీసుకున్నారు.

ప్రతి విద్యాసంస్థలో క్రమంగా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నది కలెక్టర్ ఉద్దేశం.విద్యార్థులకు ఔషధ మొక్కల గురించి అవగాహన కల్పించేందుకు గాను పాఠశాలల్లో సీడ్ బ్యాంకులను ఏర్పాటు చేసి విత్తనాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగానే జిల్లావ్యాప్తంగా వనమహోత్సవంలో పెద్ద ఎత్తున ప్రజలకు ఉపయోగపడే మొక్కలను మాత్రమే నాటటానికి సిద్ధం చేస్తున్నారు. దీనివల్ల విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ఆసక్తి పెరిగి, ఆచరణాత్మకంగా ప్రకృతి పరిరక్షణ పట్ల చొరవ పెరుగుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యభద్రతకు కూడా ఒక శుభ సంకేతంగా నిలుస్తుందని జిల్లా ప్రజలు అభినందిస్తున్నారు.

### జాతీయ గుర్తింపు దిశగా జిల్లా

జిల్లాలో భౌగోళిక శాస్త్రం పై ఉన్న ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకొని ప్రపంచంలోనే మూడవ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ జిల్లా భద్రాద్రి జిల్లాకు మంజూరు కావడం లో ఆయన తీసుకున్న చొరవ ప్రశంసనీయమైనది.ఇది భవిష్యత్తులో విద్యార్థులకు ప్రపంచ స్థాయిలో అవకాశాలు అందించేలా మారనున్నది.

### ఇంకుడు గుంతల ఉద్యమం - దేశం మొత్తం జిల్లా వైపు చూసేలా చేసింది

కేవలం ఆదేశాలిచ్చే స్థాయిలో పరిమితం కాకుండా జిల్లా కలెక్టర్ స్వయంగా పలుగు పట్టి, మట్టి మోసి, ప్రజల మధ్య పనిచేయడం ద్వారా ఒక ఉదాహరణగా నిలిచారు. అధికారులే కాదు, ప్రజలందరూ కలెక్టర్ ఆదర్శాన్ని అనుసరించి, పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణంలో పాలుపంచుకున్నారు. ఈ ఉద్యమం గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా, భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించే దిశగా పటిష్టమైన అడుగులు వేసింది. ఈ ప్రజాప్రేరిత ఉద్యమం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. భద్రాద్రి జిల్లా ఇంకుడు గుంతల నిర్మాణంలో భద్రాద్రి మోడల్ గా నిలిచింది.

### పేదలకే ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలితం

పేదల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అందేలా ప్రత్యేక కృషి చేశారు. ఆయ న పర్యవేక్షణలో అన్ని సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా కొనసాగి, పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరేలా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటుచేశారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయివరకు తనిఖీలు నిర్వహిస్తూ, పథకాల అమలు పురోగతిని స్వయంగా సమీక్షించారు. అన్ని పథకాల్లో అక్రమ లబ్ధిదారులను తొలగించి, అర్హులైన పేదల వివరాలను అప్ డేట్ చేయడం ద్వారా వాస్తవంగా అవసరమైన వారికి మేలు చేకూరేలా చేశారు. ప్రతి ఒక్క పథకంపై ప్రత్యేక దృష్టి పెట్టిన కలెక్టర్ , అధికారులతో నిరంతర పర్యవేక్షణ చేస్తూ సంక్షేమ పథకాల ఫలాలను నిస్వార్థంగా ప్రజలకు అందించారు. ఈ చర్యల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో వాస్తవమైన మార్పులు తీసుకురావడంలో ముఖ్యపాత్ర పోషించారు.

### జిల్లాలో మట్టి ఇటుకలతో ప్రహరీ గోడల నిర్మాణం ప్రారంభం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధిలో మరో వినూత్న అధ్యాయం ప్రారంభమైంది. పర్యావరణహితం మరియు తక్కువ వ్యయంతో నిర్మాణాలు చేపట్టే దిశగా జిల్లాలో ప్రయోగాత్మకంగా మట్టి నుండి ఇటుకలు తయారీ చేపట్టారు. ఈ ఇటుకలను వినియోగించి కొన్ని ప్రహరీ గోడల నిర్మాణం విజయవంతంగా పూర్తి చేశారు. ఈ ప్రాజెక్టు తొలి దశ విజయవంతం కావడంతో, రానున్న సంవత్సరంలో జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు మట్టి ఇటుకలతో ప్రహరీ గోడల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. దీనివల్ల నిర్మాణ వ్యయం తగ్గుతుండగా, స్థానిక వనరులను వినియోగించడం ద్వారా ప్రజలకు ఉపాధి అవకాశాలు కలిగాయి. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముందుచూపుతో చేపట్టిన ఈ కార్యక్రమం పాఠశాలల భద్రత, సౌందర్యానికి తోడ్పడడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు ఉదాహరణగా నిలుస్తోంది. ఈ విధంగా, ప్రభుత్వ వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, స్థానిక స్థాయిలో లభ్యమయ్యే మట్టిని సద్వినియోగం చేస్తూ, కొత్త తరం నిర్మాణాలకు మార్గం వేస్తూ జిల్లా మరో ముందడుగు వేసింది.

### గిరిజన సంస్కృతి చాటిన "ఏరు ఫెస్టివల్

జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆధ్వర్యంలో గిరిజనుల ఆచార వ్యవహారాలు, సాంస్కృతిక విలువలు ప్రపంచానికి పరిచయం చేసే విధంగా "ఏరు ఫెస్టివల్" ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవం ద్వారా గిరిజన తెగల జీవన విధానాన్ని, పాటలు, నృత్యాలు, హస్త కళలు, సంప్రదాయ వంటకాలను ప్రదర్శించే అవకాశం లభించింది. ఈ వేడుకలో స్థానిక గిరిజనులు తమ పరంపరాగత దుస్తుల్లో పాల్గొని, తమ ఆరాధ్య దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సాంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. పర్యాటకులను ఆకర్షించేలా స్టాల్స్, ప్రదర్శన మండపాలు ఏర్పాటు చేయడం ద్వారా గిరిజన జీవన శైలి పై విశేష అవగాహన కలిగించారు. కలెక్టర్ స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొని, గిరిజనుల విలువైన ఆచారాలను విశ్వవ్యాప్తం చేయాలనే ఉద్దేశంతో ఈ ఉత్సవాన్ని నిర్వహించడం అభినందనీయం. జిల్లా స్థాయి నుండి జాతీయ స్థాయికి గిరిజన సంప్రదాయాలను తీసుకెళ్లే దిశగా ఇది ఒక ముందడుగుగా నిలిచింది. ప్రతిరోజూ 24 గంటలూ అందుబాటులో ఉంటూ, అత్యవసరాలపై తక్షణ స్పందన, అధికార యంత్రాంగం పట్ల సమన్వయం, ప్రజల బాగుపై ప్రత్యేక శ్రద్ధను చూపుతున్నారు. ప్రభుత్వ పథకాల అమలులో పకడ్బందీ పర్యవేక్షణతో పాటు, ప్రతి శాఖ పనితీరును నిరంతరం సమీక్షిస్తూ జిల్లా అభివృద్ధిని నడిపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రజల అభ్యర్థనలపై స్పందిస్తూ వారికి ప్రభుత్వం అందిస్తున్న సేవలు నేరుగా అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ విధంగా ప్రజల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసే దిశగా శ్రమిస్తున్న కలెక్టర్ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

## గిరిజన మహిళా సొసైటీలకే ఇసుక ర్యాంపుల నిర్వహణ బాధ్యత

- ఐటీడీఏ పీవో రాహుల్



భద్రాచలం, జూన్ 16(ప్రజాజ్యోతి ): ఐటీడీఏ, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన మహిళలకు పారిశ్రామికంగా చేయూత అందించి ఆదివాసీ గిరిజన మహిళలు సొంతంగా ఇసుక ర్యాంపులు నడుపుతూ జీవనోపాధిని పెంపొందించుకోవాలని, వీటి నిర్వహణ బాధ్యత వారికే అప్పగించడం జరుగుతుందని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో మహిళా సొసైటీలతో నిర్వహించిన సమా వేశంలో పీవో మాట్లాడారు. ఐటీడీఏ పరిధిలో ఇసుక ర్యాంపులు నిర్వహిస్తున్న గిరిజన మహిళలు కాంట్రాక్టర్లు, బినామీలను నమ్మి ఇసుక ర్యాంపుల నిర్వహణ వారికి అప్పగించకుండా మహిళలు ఐక్యంగా ఉండి గోదావరిలో ఇసుక వెలికితీత, నిర్వహణ బాధ్యత ఉత్పత్తి స్థాయిలో ఏజెన్సీ ప్రాంతంలో ఆయా గ్రామాల పరిధిలో ఉన్న సొసైటీలు సొంతంగా ఇసుక ర్యాంపులు నిర్వహించుకోవడానికి తద్వారా జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఈ అవగాహన కల్పించినట్లు తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద రెండు సొసైటీలు ఎంపిక చేసి రూ.50లక్షల చొప్పున ఆర్థిక వెసులుబాటు కల్పించి అధికారుల సాయంతో గోదావరిలో ఇసుక స్టాక్ పాయింట్ గుర్తించి టిప్పర్లు ప్లానింగ్ మిషన్, దోజర్లు అద్దెకు ఇప్పించడం జరుగుతుందని, వాటి ద్వారా ఇసుక స్టాక్ పాయింటికి తరలించిన దగ్గర నుంచి ఎన్ని క్యూబిక్ల ఇసుక టిప్పర్ల ద్వారా రవాణా అవుతుంది... ఇసుక స్టాక్ పాయింట్కి చేరవేసిన దగ్గర నుంచి వాటి నిర్వహణ బాధ్యత పూర్తిగా ఇసుక సొసైటీ మహిళలే నిర్వహించాలన్నారు. అక్కడి ఇబ్బందులను గిరిజన మహిళలను అడిగి తెలుసుకుని పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పిసా స్పెషలాఫీసర్ మణిధర్, ఖనిజాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శంకర్ నాయక్ , సొసైటీల మహిళలు పాల్గొన్నారు.

## ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలలో లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థుల హవా

భద్రాచలం టౌన్, జూన్ 16 (ప్రజాజ్యోతి): ఇంటర్ ఫలితాలలో సంచలన మార్కులతో పాటు ఎంసెట్ ఫలితాలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఉత్తమ ర్యాంకులు సాధించిన లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థుల హవా జేఈఈ మెయిన్స్ లో కూడా కొనసాగిన విషయం తెలిసిందే. సోమవారం ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలలో సైతం లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు అయిన ఎంపీసీ విభాగం లో (468/470) మార్కులు ఇద్దరు, (467/470) ఒకరు, (466/470) మార్కులు నలుగురు (465/470) ఇద్దరు, (464/470) నలుగురు, (463/470) ఒకరు, (460/470) బైపీసీ విభాగం లో (438/440) ఒకరు, (435/440) ఒకరు, (433/440) ఒకరు అలాగే సిఇసి విభాగం లో (488/500) ఒకరు, (478/500) ఒకరు, (477/500) ఒకరు, (472/500) ఒకరు, ఎంఇసి విభాగం లో (486/500) ఒకరు సాధించి మరో సంచలనానికి కేంద్ర బిందువు అయ్యారు. ఈ సందర్భంగా లిటిల్ ఫ్లవర్స్ విద్య సంస్థల డైరెక్టర్ మాగంటి శ్రీనివాస వర ప్రసాద్, మాగంటి రమేష్ బాబు లు విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఫలితాలలో 993 మార్కులతో సంచనాలను సృష్టించిన మా విద్యార్థులు ఎంసెట్ ఫలితాలు సైతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అత్యుత్తమ ర్యాంకులను సాధించారని అన్నారు. జేఈఈ మెయిన్స్ ఫలితాలు సైతం అత్యుత్తమ పర్సంటేజ్ లిటిల్ ఫ్లవర్స్ కే సొంతమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జేఈఈ మెయిన్స్ బి ఆర్క్ విభాగం సైతం 513 ర్యాంకు సాధించి పరీక్ష ఏదైనా ఉత్తమ ఫలితం మాత్రం లిటిల్ ఫ్లవర్స్ కే సొంతమని నిరూపించారని కొనియాడారు. ఈ ఫలితాలు తమపై బాధ్యత మరింతగా పెంచాయని భవిష్యత్తులో ఇంతకుమించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని అన్నారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల శిక్షణతో పాటు తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయాలు సాధ్యమవుతున్నాయని అన్నారు అనంతరం ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్ ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# కక్ష సాధింపుతోనే కేటీఆర్ కు నోటీసులు



ఇల్లందు, జూన్ 16, ప్రజాజ్యోతి: కక్ష సాధింపుతో చర్యల్లో భాగంగానే బిఆర్ys వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు నోటీసులు ఇవ్వడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ లు ఆరోపించారు. సోమవారం ఫార్ములా ఈ రేస్ కేసులో ఏసీబీ విచారణకు హాజరవుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు సంఘీభావంగా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఇచ్చిన పిలుపు మేరకు ఇల్లందు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, బిఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు, మాజీ జిల్లా అధ్యక్షులు దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులతో కలిసి హైదరాబాదులోని తెలంగాణ భవన్ కు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఒకసారి కేటీఆర్ సుదీర్ఘంగా విచారించి కూడా ఎలాంటి ఆధారాలను చూపించ లేకపోయినా దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ అని విమర్శించారు. నేటికి కేవలం విచారణ పేరుతోనే కాలం గడుపుతున్నారని, ఒక్క ఆధారం కూడా చూపించడానికి కాంగ్రెస్ పార్టీ దగ్గర ఆధారాలు లేవని, ఇది కేవలం రాజకీయ కుట్ర కోణంలో జరుగుతున్న నిరాధారమైన కేసు అన్నారు. ఇప్పటికైనా ఏమైనా బలమైన ఆధారాలు ఉంటే ప్రజాక్షేత్రంలో ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ ఎన్నిసార్లు సవాలు విసిరినా కానీ సవాలును స్వీకరించలేని స్థితిలో ఈ చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన ఉందని ఆరోపించారు. ఫార్ములా ఈ రేస్ సజావుగా సాగిందని అందులో ఎలాంటి అక్రమాలు జరగలేదని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయలేక తెలంగాణ రాష్ట్ర ప్రజల దృష్టిని మరలించడానికి ఇటువంటి కుయుక్తులు పన్నుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్ములా ఈ రైస్ నిర్వహించడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నగరానికి ప్రత్యేక ఖ్యాతి లభించిందని, ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు రావడానికి దోహదపడిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ రంగనాథ్, జాఫర్ హుస్సేన్, బొమ్మెర్ల వరప్రసాద్, దాస్యం ప్రమోద్, మూడు కృష్ణప్రసాద్, అబ్దుల్ నబీ, గిన్నారపు రాజేష్, సాతల హరికృష్ణ, ఎంటెక్ మహేందర్, గంద్రతి చంద్రావతి, చాంద్ పాషా, నెమలి నిఖిల్, గౌస్, మూలగుండ్ల ఉపేందర్ రావు, వార రమేష్, కొండు రవికాంత్, మునిగంటి శివ, మునీర్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

## యోగా శిక్షణా తరగతులు



ఇల్లందు, జూన్ 16, ప్రజాజ్యోతి: జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత ప్రభుత్వం, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు కోల్ ఇండియా అనుబంధ బొగ్గు సంస్థలలో ఈనెల 14 నుంచి 20వరకు నిర్వహించే యోగా బూట్ క్యాంపుల నిర్వహణలో భాగంగా సోమవారం ఏరియాలోని మైన్స్ అండ్ డిపార్ట్మెంట్స్, జియంకార్యాలయంలో యోగా శిక్షకులచే ఉద్యోగులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ఉదయం ఇల్లందు ఏరియా ఉద్యోగులచే మెగా యోగా కార్యక్రమం నిర్వహించబడునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో మైన్స్, డిపార్ట్మెంట్ల అధికారులు, ఉద్యోగులు, యోగా మాస్టర్ పాల్గొన్నారు.

## మాజీ మంత్రిని కలిసిన రవికాంత్



ఇల్లందు, జూన్ 16, ప్రజాజ్యోతి: రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును సోమవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్ యువజన నాయకుడు కొంటూరు రవికాం త్, టిబిజికెఎస్ ఇల్లందు ఏరి యా వైస్ ప్రెసిడెంట్ యండి. జాఫర్ హుస్సేన్ లు కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

## అధికారుల చర్యలు అనాగరికం

- దళిత మైనారిటీ వర్గాలపై ఇంతటి క్రూరత్వమా
- న్యాయం జరగకపోతే బాధితులకు అండగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తాం.. కొరిపల్లి శ్రీనివాస్.. తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు




అశ్వారావుపేట, జూన్ 16, ప్రజాజ్యోతి: హక్కు పత్రాలు ఉన్న ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా దళిత, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుపేద కుటుంబాలు నివసిస్తున్న గృహాలను కూల్చటం అనాగరికమని అధికారులు ఇంతటి క్రూరత్వంగా ఎలా వ్యవహరిస్తారంటూ తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు కొరిపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రింగ్ రోడ్డు వద్ద గల 1167 సర్వే నెంబర్ లో చిరంజీవి అనే దళిత సోదరుడు కాజా అనే మైనారిటీ సోదరుడికి నివాస గృహాలు ఉన్నాయని, గత 40 సంవత్సరాలుగా వారు అక్కడే నివసిస్తున్నారని, వాటికి అన్ని అనుమతి పత్రాలు రిజిస్ట్రేషన్ ఇంటి పన్నులు విద్యుత్ బిల్లులు సహా అన్ని అనుమతులు ఉండగా అటవీ అధికారులు ఆ భూములు తమవని ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నివసిస్తున్న గృహాలను కూల్చివేశారని ఇది దుర్మార్గమన్నారు. బాధితులకు న్యాయం జరగాలని దుర్మార్గంగా వ్యవహరించిన అధికారులపై ఎస్సీ ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే బాధితుల పక్షాన రాష్ట్రవ్యాప్త పోరాటానికి మాదిగ హక్కుల దండోరా సిద్ధంగా ఉందని వారికి న్యాయం జరగకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాదిగ హక్కుల దండోరా సభ్యులు పాల్గొన్నారు.

## కేటీఆర్ కు బీఆర్ఎస్ నియోజకవర్గ నేతల మద్దతు

భద్రాచలం, జూన్16(ప్రజాజ్యోతి ): హైదరాబాద్ లో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఏసీబీ విచారణకు హాజరుకావడంతో ఆయనకు భద్రాచలం నియోజకవర్గం బీఆర్ఎస్ నేతలు ఖమ్మం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ తరలివెళ్లి మద్దతు పలికారు. తెలంగాణ భవన్ లో కేటీఆర్ ను కలిసి మీకు అండగా బీఆర్ఎస్ నాయకత్వం ఉంటుందన్నారు. కేటీఆర్ కు మద్దతు పలికిన వారిలో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ, కోటగిరి ప్రబోద్ కుమార్ , దుమ్ముగూడెం మండల కన్వీనర్ కణితి రాముడు, అయినాల రామకృష్ణ, భద్రాచలం నియోజకవర్గ నాయకులు పలువురు ఉన్నారు.



# ఆర్థికంగా నష్టపోయిన రైతులకు పరామర్శ

- వంద్యత్వ మొక్కల ఆయిల్ ఫామ్ క్షేత్రాలను పరిశీలించనున్న రాష్ట్ర రైతు సంఘం...
- కొక్కెరపాటి పుల్లయ్య ఆయిల్ ఫామ్ రైతు సంఘం రాష్ట్ర నాయకులు



**అశ్వారావుపేట, జూన్ 16, ప్రజాజ్యోతి:** వంధ్యత్వ మొక్కలతో పంట దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోయిన రైతులను పరామర్శిస్తూ, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి సాగర్ తో పాటు పలువురు సభ్యుల బృందం నేడు వేంసూరు, సత్తుపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని ఆయిల్ ఫామ్ క్షేత్రాలను పరిశ్రమలను పరిశీలించనున్నారని తెలంగాణ ఆయిల్ ఫామ్ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కొక్కెరపాటి పుల్లయ్య తెలిపారు. సోమవారం పత్రికలకు విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ వంధ్యత్వ మొక్కల సమస్యపై గత రెండు సంవత్సరాలుగా ఆయిల్ ఫామ్ యాజమాన్యానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ,తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లకు రాతపూర్వక విన్నవించిన కనీసం స్పందించట లేదన్నారు. రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిసిన, వారిని ఆదుకునేలా చర్యలు తీసుకోవడం లేదన్నారు. వంధ్యత్వ మొక్కలతో రైతులు ఇబ్బందులు పడుతున్న ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రేగళ్లపాడు నర్సరీలో వంధ్యత్వ మొక్కలు ఉన్నాయని ఆయిల్ ఫెడ్ అధికారులే నిర్ధారించి తిరిగి వాటిని పెంచి రైతులకు అందించడంలో వారి ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఐఐఓపిఆర్ శాస్త్రవేత్తల ప్రమేయం లేకుండా అధికారులు ఇష్టానుసారం మొక్కలను రైతులకు పంపిణీ చేస్తున్నారన్నారు. ఆయిల్ ఫామ్ రైతులే ఎదుర్కొంటున్న అనేక సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లటానికి ప్రత్యక్ష కార్యచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్ తో పాటు భద్రాద్రి కొత్తగూడెంజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అన్నవరపు సత్యనారాయణ, యలమంచిలి వంశీకృష్ణ, ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఆయిల్ ఫామ్ గ్రోయర్స్ రాష్ట్ర నాయకులు తుంబూరు మహేశ్వర్ రెడ్డి, తదితరులు ఈ పర్యటనలో పాల్గొననున్నారని ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

- లక్ష్మీదేవి పల్లి మండల ప్రెస్ క్లబ్ ఎన్నిక ఏకగ్రీవం
- అధ్యక్షులు.. రాజ్ శేఖర్, ప్రధాన కార్యదర్శిగా.. యాకుపాషా నియామకం.



**కొత్తగూడెం, జూన్ 16, (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవి పల్లి మండల జర్నలిస్టుల ప్రెస్ క్లబ్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ క్రిష్ణ ఇన్ హోటల్ లో జర్నలిస్టులు సమావేశమై ఈ కమిటీని ఎన్నిక చేశారు. ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులుగా శంకర్ (వార్త), అధ్యక్షుడిగా రాజ్ శేఖర్ (మన తెలంగాణ), ఉపాధ్యక్షుడిగా శేఖర్ (సాక్షి), పురుషోత్తం (జనంసాక్షి), ప్రధాన కార్యదర్శిగా యాకుబ్ పాషా (ఆంధ్రప్రభ), సహాయ కార్యదర్శిగా మురళి (మనం), నాగరాజు (సూర్య), కోశాధికారిగా వెంకట్ (నవతెలంగాణ), క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా వాహబ్ (నవభూమి), రాజేందర్ (వెలుగు), షఫీ (సూర్య), ప్రసాద్ (మెట్రో ఈవెనింగ్), సతీష్ (దిశ), అశోక్ (ప్రజాజ్యోతి) లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రాజ్ శేఖర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో ముందుంటానని హామీ ఇచ్చారు.

## అంగన్వాడీలో అక్షరాభ్యాసం కార్యక్రమం



**టేకులపల్లి,జూన్16,ప్రజాజ్యోతి:** మండలంలోని టేకులపల్లి సెక్టర్లో అన్నమాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా సిడిపిఓ కె. ఎం తార ఆధ్వర్యంలో సోమవారం అక్షరాభ్యాసం కార్యక్రమం వైభవంగా నిర్వహించి, ర్యాలీ నిర్వహించారు.చిన్నారులు పట్టుకుని అక్షరాలు దిద్దించారు. మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్వాడీలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్ అనురాధ, టీచర్ ఇందిరమ్మ ,ఆయా నాగమణి ,పిలల్లు తల్లి తండ్రులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి




**ఇల్లందు, జూన్ 16, ప్రజాజ్యోతి:** ప్రతి ఒక్కరూ వారి ఇంటి ఆవరణలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ డిఈ మురళి, డిఆర్డిఏ టెక్నికల్ అసిస్టెంట్ రాజు లు సూచించారు. సోమవారం పట్టణంలో పలు ఇంకుడు గుంతలను జలశక్తి అభియాన్ టీమ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో 155 ఇంకుడు గుంతలు తవ్వించడం జరిగిందని, అలాగే ఇంటి యజమానులను ప్రోత్సహించి కొందరి చేత సొంతంగా ఇంకుడు గుంతల నిర్మాణం చేయించడం జరిగిందని పేర్కొన్నారు. అట్టి ఇంకుడు గుంతలను జలశక్తి అభియాన్ సైట్ లో నమోదు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

## కే ఓసి లో క్వాలిటీ బొగ్గు ఉత్పత్తి గురించి అధికారులతో సమీక్ష సమావేశం.



**టేకులపల్లి,జూన్ 16,ప్రజాజ్యోతి :** ఇల్లందు ఏరియా కోయగూడెం ఓపెన్ కాస్ట్ లో ఏరియా జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్య క్వాలిటీ బొగ్గు ఉత్పత్తి గురించి అధికారులతో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏరియా జిఎం మాట్లాడుతూ బొగ్గు అధిక ఉత్పత్తి,రక్షణతో పాటు నాణ్యత కూడా చాలా ముఖ్యమని అన్నారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయడంలో ప్రతి ఒక్కరిపై బాధ్యత ఉంటుందన్నారు బొగ్గు నాణ్యతలో సూపర్వైజర్ లే కీలకపాత్ర పోషిస్తారని అన్నారు. రాబోయే రోజుల్లో క్వాలిటీ బొగ్గు రావాలని క్వాలిటీ బొగ్గు లేకపోతే ఇల్లందుకు మనుగడ లేదని వారు అన్నారు. కాబట్టి అందరూ సమిష్టి కృషితో నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయాలని అధికారులకు తగు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కెఓసి, పి.ఓ. గోవిందరావు, క్వాలిటీ మేనేజర్ రాందాస్,ఇంచార్జి మేనేజర్ కె. ఓ. సి. యూ.బ్రహ్మం,అన్ని షిఫ్టుల అండర్ మేనేజర్లు, సూపర్వైజర్లు , సంబంధిత ఉద్యోగులు పాల్గొన్నారు.

## రైతు వేదికలలో రైతు నేస్తం కార్యక్రమం



**టేకులపల్లి,జూన్ 16,ప్రజాజ్యోతి :** మండలంలోని ప్రేగల్లపాడు, బోడ్, ముత్యలం పాడు క్రాస్ రోడ్డు రైతువేదిక ల నుండి రైతులు రాష్ట్ర ప్రభుత్వం 1031రైతువేదిక లకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం ప్రారంభోత్సవ కార్యక్రమం ను ప్రత్యక్షంగా సోమవారం వీక్షించడం జరిగినది.అలాగే రైతు భరోసా కింద రాష్ట్ర రైతులందరికీ అన్ని ఎకరాలకు రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయని ముఖ్యమంత్రి రైతులకు సందేశం ఇవ్వడం జరిగినది .ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎన్.అన్నపూర్ణ, హార్టికల్చర్ ఆఫీసర్ స్రవంతి, ఏఇ కన్నయ్య , ఈ ఓ లు ప్రవీణ్, శ్రావణి, భాగ్యశ్రీ , రమేష్, రెహానా సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ ,మార్కెట్ డైరెక్టర్ జార సమ్మక్క,రైతులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ



**భద్రాచలం కల్చరల్ , జూన్ 16(ప్రజాజ్యోతి ):** భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలో మూలవరులకు హైదరాబాద్కు చెందిన భక్తులు రూ.30లక్షలతో తయారుచేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామివారికి ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి బేడా మండపంలో నిత్యకల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

## సింగరేణి డైరెక్టర్ ను కలిసిన ఏఐటియుసి నేతలు



**ఇల్లందు, జూన్ 16, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ డైరెక్టర్ పర్సనల్ అండ్ వెల్ఫేర్ (పా) గా బాధ్యతలు స్వీకరించిన గౌతమ్ పొట్రు ను సోమవారం ఏఐటియుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సెంట్రల్ కమిటీ, ఇల్లందు బ్రాంచ్ కమిటీ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా సమస్యల పరిష్కారం కోసం సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. సంస్థ పురోభివృద్ధి కొరకు కలిసి పనిచేద్దామని, ఇల్లందు జెకె ఓసి బొగ్గు తీసే పనులు సింగరేణి చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె. సారయ్య, నాయకులు దాసరి రాజారాం, వైవీ రావు, రాంగోపాల్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.